క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారి సేవలో మండలి చైర్మన్ మోషేన్ రాజు



రాయలంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు చైర్మన్ కొయ్యే మోషేన్ రాజుకు వేదాశీర్వచనం అందించారు. అలాగే మోషేన్‌రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల సేవాదళ్ అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకుడు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో 38వ వార్డు లంక పేటలో నిరసన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకుంఠరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ చార్జీలు పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, కొమరగిరి సాయమ్మ, కుమారి, కొమరగిరి రమేష్, సామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు ఘన నివాళి



సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఎమ్మార్కె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సర్దార్ వల్లభాయ్‌పటేల్, పొట్టి శ్రీరాముల వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పొట్టి శ్రీరాములు రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణ చేసిన విధానాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జుత్తిగ శ్రీనివాస్, శనివారపు ప్రసాద్, వై.భానుకుమారి, బోను దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఆకివీడు: పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు చెప్పారు. స్థానిక దొరగారి చెరువును పార్కు, వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తానన్నారు. అర్బన్‌హెల్త్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అర్బన్‌హెల్త్ సెంటర్‌లో ల్యాబొరేటరీ ప్రారంభించామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఉత్తరిల్లి నర్సింహరాజు, పార్టీ మండల అధ్యక్షుడు మోటుపల్లి ప్రసాద్, బీజేపీ, జనసేన నియోజకవర్గ కన్వీనర్లు కోరా రామూర్తి, జుత్తిగ నాగరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ కె. బలరామరాజు తన సిబ్బందితో ఆదివారం దిరుసుమర్రులో దాడులు చేశారు. ఈ దాడుల్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న వీరమల్లు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆయనపై కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా బెల్టు షాపు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపు నిర్వహిస్తే 94409 02439కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేయాలి



సభలో మాట్లాడుతున్న గూడూరు సీతా మహాలక్ష్మి

పాలకోడేరు: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనలో మనమంతా భాగస్వాములు కావాలని శరీర అవయవ దాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతా మహాలక్ష్మి పిలుపునిచ్చారు. శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 73వ వర్ధంతి సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఎంత మంది బ్రతిమాలినా రాష్ట్ర సాధన కోసం చేస్తున్న నిరాహార దీక్ష నుంచి రాజీ పడలేదన్నారు. ఆయన ఆశయ సాధనలో మనమంతా సమాజం కోసం మన వంతు కషి చేయాలని కోరారు. రక్త దానం చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు బ్రెయిన్ డెడ్ అయితే శరీర అవయవాలను దానం చేసి కొంత మంది ప్రాణాలను కాపాడటం ద్వారా పునర్జన్మ పొందొచ్చన్నారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి, కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్, సంఘం ఉపాధ్యక్షుడు కూర్మాల పూర్ణారావు, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, కోశాధికారి ఆత్యం వాసు, కూర్మాల నారాయణరావు, కాశీ, దుర్గా భవాని, కన్యక, శ్రీరామ చంద్రగుప్త, కుసుమ గుప్త, గ్రంధి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి పొట్టి శ్రీరాములు

ఆకివీడు: ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించి, ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ధన్యజీవని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు బీజం పొట్టి శ్రీరాములేనన్నారు. తెలుగు ప్రజల ఖ్యాతిని ఉద్యమ రూపంలో నలుదిక్కులా చాటి దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయన్నారు. ఆయన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రగతికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రమేష్ చెప్పారు.

ప్రసన్నాంజనేయునికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

భీమవరం(ప్రకాశంచౌక్): స్థానిక శ్రీరాంపురంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష తులసి దళ అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు సన్నిధి రాజు పవన్ కుమార్, సాధు అయ్యప్ప, పవన్ కుమార్, మధిర అయ్యప్ప, మరేళ్ళ అఖిలేష్ శర్మ అర్చకుల బృందం నేతృత్వంలో అభిషేకాలు అర్చన కార్యక్రమం నిర్వహించారు.

కనుల పండువగా దత్తాత్రేయుడి తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక కొత్తపేట బాబా ఆలయంలో వేంచేసియున్న దత్తాత్రేయస్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఉండి కాలువలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కాలువ గట్లపై భక్తులు నిలిచి స్వామి వారిని దర్శించుకుని ఆత్మీయ స్వాగతం పలికారు. విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లా కిరణ్ ప్రసాద్ నిర్వహించిన కార్యక్రమం ఉదయం నుంచి బాబా ఆలయంలో విశేష పూజలు చేశారు. సాయంత్రం నుంచి ఆలయంలో చేపట్టిన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, స్వామి వారి సంకీర్తనలతో హోరెత్తింది. స్వామి వారికి తులసీదళ అలంకరణతో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు, అనంతరం ప్రసాద వితరణ చేపట్టినట్లు ఆలయ ప్రధానార్చకుడు సన్నిధిరాజు చలపతిరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అందమైన బొమ్మల దర్శకుడు బాపు



వైద్యులను సత్కరిస్తున్న సాహితీ సంస్థ ప్రతినిధులు

తణుకు టౌన్: అందమైన అమ్మాయికి మారుపేరుగా బాపు చిత్రాలు నిలుస్తాయని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.సత్యనారాయణరాజు అన్నారు. ఆదివారం ప్రముఖ చిత్ర దర్శకుడు సత్తిరాజు లక్ష్మీనారాయణ (బాపు) జయంతి సందర్భంగా తణుకు సాహితీ సామ్రాజ్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాపు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ బాపు తెలుగు చిత్ర రంగంలో ప్రఖ్యాత దర్శకుడిగా నిలిచారని, ఆయన తన కొంటె బొమ్మలతో అశేష అభిమానులను ఆకట్టుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి కఠారి సిద్ధార్థ, వేగేశ్న సత్యనారాయణరాజు, డాక్టర్ బంగారు రమేష్‌కుమార్, బోడపాటి ప్రసాద్, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పి.వీరభద్రం, రఘుమండ శ్రీను, పీవీ కొండలు, బీవీ సత్యనారాయణ, వీఎల్‌పీ కుమార్‌రాజు, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్



భీమవరం అనసూయ చెస్ అకాడమీలో చెస్ కోచింగ్ ఇస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం అనసూయ చెస్ అకాడమీలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ కోచింగ్ క్యాంప్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది. అనసూయ చెస్ అకాడమీ సెంటర్ నిర్వాహకుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంపులో ఇంటర్నేషనల్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్ చే క్రీడాకారులకు చదరంగంలో అత్యున్నత స్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. మన ప్రాంతం నుంచి కూడా క్రీడాకారులను ఇంటర్నేషనల్ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో ఇంటర్నేషనల్ మాస్టర్‌తో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం మరింత అవసరమని, భవిష్యత్తులో భీమవరం నుండి ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ స్థాయికి తీర్చిదిద్దుతామన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్ గిరినాథ్ మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంపులో ఎంతో టాలెంట్ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, వారి తల్లిదండ్రులు కూడా ఎంతో పట్టుదలతో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని అన్నారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, సురేష్ జైన్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు

పాలకోడేరు: మార్గశిరమాసం, పౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం– ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, భీమవరం కమిటి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ఆదివారం మండలంలోని పెన్నాడపాలెం గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత సభ్యులు మాట్లాడుతూ మార్గశిర మాసంలో శిరం అనగా తల అని మార్గం అనగా దారి అని, తలలోకి దారి అనే విధానం ఉన్నదని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. దీపావళి పండుగ అర్థం ప్రకారం గురువు యొక్క జ్ఞానాగ్నిని పొందిన శిష్యుడు కార్తీక మాసంలో దీపపు వెలుగులో అనగా యోగ మార్గంలో ప్రయాణించిన శిష్యుడు ఇక్కడ మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరుటకు సులభంగా దారి ఏర్పడుతుందనేందుకు గుర్తుగా ఉంది కాబట్టి మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలన్నారు. దైవ భక్తితో గ్రంథ పఠనంతో జ్ఞానంలో ఉండాలని ప్రబోధించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక, భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, సభ్యులు వెంకటలక్ష్మి, భవాని, సుజాత, హనుమంతరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, భానుమతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత యూత్ హాస్టల్స్ లక్ష్యం



యూత్ హాస్టల్స్ ప్రముఖులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పర్యాటకం, అడ్వెంచర్ స్పిరిట్, జాతీయ సమైక్యత, విద్య ఆరోగ్యం ప్రోత్సహించడం, పరిమిత మార్గాల్లో మిలియన్ల మంది యువతకు వారి ప్రయాణ సమయంలో సరసమైన ధరలకు స్థిరమైన ప్రాతిపదికతో సాహసాలు చేయించడం యూత్ హాస్టల్స్ లక్ష్యమని యూత్ హాస్టల్స్ జాతీయ చైర్మన్ మనోజ్ జోహిరి, నేషనల్ వైస్ చైర్మన్ రబీ శంకర్ పాల్ అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 10 రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి విచ్చేసిన 100 మంది యూత్ హాస్టల్స్ ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, యూత్ హాస్టల్స్ చైర్మన్ డా. వీవీ సోమరాజు, మాట్లపూడి సత్యనారాయణ, భీమవరం అధ్యక్షుడు చిలుకూరి నరసింహరాజు, కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్, కార్యదర్శి నందమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం ఏర్పాటు



మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ డిఫెన్స్ అకాడమీ సౌజన్యంతో ఆశ్రం హాస్పిటల్ ఏలూరు వారిచే మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, పెడియాట్రిక్, గైనిక్, కంటి, చర్మ స్పెషలిస్ట్ వైద్యులచే 1500 మంది విద్యార్థులకు, ప్రజలకు వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. టీబీఆర్ గ్రూప్ చైర్మన్ భోగేశ్వరరావు, పీఆర్ఓ దుర్గా ప్రసాద్, కరస్పాండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఏకగ్రీవాలు అభినందనీయం



నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో బీజేపీ నాయకులు

భీమవరం: నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీకి ఎక్కువ సాగునీటి సంఘాలు ఏకగ్రీవం కావడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, బీజేపీ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ అన్నారు. భీమవరం బీజేపీ కార్యాలయంలో ఆదివారం అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ నలుగురు అధ్యక్షులు, 8 మంది వైస్ ప్రెసిడెంట్లు, 56 నీటి సంఘాలు సభ్యులుగా ఎన్నికయ్యారని, నూతనంగా ఎంపికైన సాగునీటి సంఘ కార్యవర్గ సభ్యులను అభినందించారు. ప్రధాన కార్యదర్శి అల్లూరి సాయి దుర్గరాజు, కోమటి రవికుమార్, కిషన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు తోట గంగరాజు పాల్గొన్నారు.

మాలల మహాగర్జనకు తరలిన నేతలు



మాల మహాగర్జనకు వెళ్తున్న నేతలు

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రాణాలైనా అర్పిస్తాం.. ఎస్సీ వర్గీకరణకు అడ్డుకుంటామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆర్గనైజర్ కోనా జోషప్, ఈది రవికుమార్ అన్నారు. మాలల మహా గర్జన చలో గుంటూరు కార్యక్రమానికి ఆదివారం భీమవరం అంబేడ్కర్ సెంటర్ నుంచి భీమవరం వాసులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై తీర్పును ఉపసంహరించుకోవాలని, సుప్రీంకోర్టు తీర్పుతో 59 కులాల మధ్య గొడవ తప్పదని అన్నారు. దేశ ప్రజ యోజనాలు తాకట్టు పెట్టి 59 కులాల మధ్య చిచ్చురేపుతున్నారని, రాష్ట్రపతి పరిధిలోని 241 ఆర్టికల్ ప్రకారం కాకుండా తీర్పు రావడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో కమలకర్, కటికల రాజారావు, కోరం ముసలయ్య, పిల్లి ముసలయ్య, సందీప్, కిరణ్, మీసాల జైరాజు, ప్రశాంత్, కోరం ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు త్యాగాలకు ప్రతీక క్రిస్మస్ వేడుక



క్రిస్మస్ వేడుకలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ జార్జ్‌ముల్లర్, సంఘాల ప్రతినిధులు

ఉండి: చెరుకువాడలో ఏడు గ్రామాలు చెరుకువాడ చినపేట, అర్తమూరు, చెరుకువాడ పెదపేట, కలిసిపూడి, ఇమ్మానుయేలు పేట, కోలనపల్లి పెదపేట, గరువుపేట బాప్టిస్ట్ చర్చిల ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి పేరిష్ క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థన కార్యక్రమంలో జార్జ్ ముల్లర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ఒక వేడుకగా కాకుండా బాధ్యతగా చేసుకోవాలన్నారు. అనంతరం సంఘాల ప్రతినిధులు పాస్టర్ జార్జ్ ముల్లర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘాధ్యక్షుడు కోరాటి శ్యామ్, పలు సంఘాల సీఆర్‌లు ఎం.శామ్యూల్, జి.దివాకర్, ఎం.పిలిఫ్, బి.శేఖర్, వై.హనోకు, సీహెచ్ యోబు, జి.జార్జ్, సంఘాల పెద్దలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కోలాహలంగా సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్ల



తిరునాళ్లలో సందడి చేస్తున్న జనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్య షష్ఠి తిరునాళ్ల కోలాహలంగా నిర్వహించారు. పిల్లలు, యువతీ యువకులు షష్ఠిలో సందడి సందడి చేశారు. ఆదివారం పాఠశాలలకు సెలవు రోజు కావడంతో పిల్లలు షష్ఠిలో సందడి చేశారు. మిగతా రోజుల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో షష్ఠి తిరునాళ్లకు ప్రాధాన్యత కన్పిస్తుంది. శివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, కొలంబస్, డ్రాగాన్ ట్రెయిన్, రంగుల రాట్నాలు ఆకర్షణీయంగా నిలిచాయి. వాటిని యువత, చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఎక్కి కేరింతలు కొడుతూ సంతోష పడ్డారు. వివిధ దుకాణాల వద్ద గృహ ఉపకరణాలు, గాజులు, కర్ర బొమ్మలు, స్టీల్ వస్తువులు, పిల్లలు ఆడుకునేందుకు వీలైన వివిధ ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పట్టణవాసులే కాక గ్రామీణ ప్రాంతాల నుంచి గృహిణులు, పిల్లలు, పెద్దలు వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఆనందోత్సవాల మధ్య తిరునాళ్ల కొనసాగుతున్నాయి.

న్యాయవాద వృత్తిని నిర్వీర్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి మునిస్వామి

తణుకు అర్బన్: బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ఆలిండియా లాయర్ల యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా లాయర్ల యూనియన్ ఉభయ జిల్లాల కమిటీ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు మేక ఈశ్వరయ్య అధ్యక్షతన ఆదివారం తణుకు బార్ అసోసియేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కామన మునిస్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు న్యాయవాద వృత్తిలో ఏవైనా లోపాలు జరిగితే దానిపై విచారణ చేసే అధికారం ఆ రాష్ట్రంలోని బార్ కౌన్సిల్‌కు ఉన్నదని మునిస్వామి అన్నారు. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం బార్ కౌన్సిల్ అధికారాలను తగ్గించి న్యాయ వ్యవస్థకు న్యాయవాదులపై చర్యలు తీసుకునే విస్తృత అధికారాలను కట్టబెట్టాలనే ఆలోచనలో ఉందని మునుస్వామి విమర్శించారు. జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకం ఎన్టీఆర్ నేస్తం వెంటనే విడుదల చేసి జూనియర్ న్యాయవాదులను ఆదుకోవాలన్నారు. బార్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.35 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు జరిగే సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ విధానంలో జూనియర్ న్యాయవాదులను మినహాయించాలని, జిల్లా స్థాయిలో క్లాసులు నిర్వహించాలని, స్థానిక బార్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యలను గుర్తించి న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లాలని, న్యాయవాదుల రక్షణకు సమగ్రమైన చట్టాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వమే చెల్లించాలని పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొవ్వూరు వెంకటేశ్వర్లు, పీపీ లక్ష్మి, పామర్తి నగేష్, కేవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

తణుకు అర్బన్: స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం.. ఆనాటి ఆ స్నేహమెంతెంతో మధురం.. ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం అంటూ తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తణుకులో సందడి చేశారు. 30 ఏళ్ల నాటి స్నేహ బంధంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో శని, ఆదివారాల్లో తణుకు వేదికగా విహారయాత్రలు, వనసమారాధనలు నిర్వహించారు. తాము విద్యాభ్యాసం చేసిన పాఠశాల ఆవరణకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చదువుల తల్లి భార్గవి ఎంతగా మారిపోయావే అని.. ఏరా శ్రీనివాసు ఇంకా ఆ అల్లరి మానేయలేదా అంటూ పలకరింపులు.. విద్యాభ్యాసంలో చేసిన అల్లరి పనులు, పాఠశాల ఎగ్గొట్టి ఆడిన ఆటలు, చూసిన సినిమాలు, గురువుల బెత్తం దెబ్బలు వంటి అంశాలు గుర్తు చేసుకున్నారు.

17 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

అత్తిలి: మండలంలో ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు కోసం ఈ నెల 17 నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఆధార్‌కార్డులు కలిగిన వారు నవీకరించుకోవచ్చని చెప్పారు. ఈ నెల 17, 18 తేదీల్లో అత్తిలి, తిరుపతిపురం, ఆరవల్లి గ్రామాల్లోనూ, 19, 20 తేదీల్లో మంచిలి, ఉనికిలి, బొంతువారిపాలెం, పాలి గ్రామాల్లోనూ, 26న గుమ్మంపాడు, ఉరదాళ్లపాలెం, 27, 28 తేదీల్లో బల్లిపాడు, కేఎస్ గట్టు, స్కిన్నెరపురం గ్రామాల సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు పని చేస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.